సాక్షి
చిత్తూరు
మంగళవారం । 10 । జూన్ । 2025



'విత్తు'కున్న కష్టాలు!

వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. క్యూలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. - 8లో



సమస్యలు పరిష్కరించండి

పేరుకుపోతున్న సమస్యలు పరిష్కరించాలని పలువురు ప్రజలు జిల్లా అధికారులకు మొరపెట్టుకున్నారు. - 8లో



రమణీయం..రథోత్సవం

గోవిందరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఎనిమిదో రోజు రథోత్సవాన్ని నిర్వహించారు . - 8లో

న్యూస్‌రీల్

పోలీసు గ్రీవెన్స్‌కు 34 ఫిర్యాదులు



బాధితుల సమస్య వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 34 వినతులు అందాయి. చిత్తూరు ఎస్పీ మణికంఠ.. సోమవారం ఏఆర్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో మోసాలు, వేధింపులు, కుటుంబ తగాదాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతీ ఒక్క సమస్యపై విచారణ చేపట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎస్పీ రాజశేఖర్ రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబు సైతం ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు.

టమాట బాక్సు రూ.300



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: జిల్లాలో టమాట ధరలకు రెక్కలొచ్చాయి. గత రెండు నెలలుగా తగ్గుముఖం పట్టిన టమాట ధర సోమవారం ఒక్కసారిగా పెరిగాయి. పలమనేరు మార్కెట్‌లో బాక్సు (15కిలోలు) ధర రూ.300పైగా పలికింది. ఇటీవల కురిసిన వర్షాలతో సగానికిపైగా టమాట తోటల్లో కాయల నాణ్యత తగ్గింది. దీంతో పాటు పంట దిగుబడిపై వర్షాల ప్రభావం పడింది. దీంతో సరుకు దిగుబడి తగ్గిపోయివడంతో ధరలు పెరిగినట్టు ఇక్కడి వ్యాపారులు తెలిపారు. రాబోవు రోజుల్లో ధరలు ఆశాజనకంగా ఉండే అవకాశం ఉందని మండీ యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులతో సమానంగా హోంగార్డుల సేవలు



మాట్లాడుతున్న హోంగార్డు కమాండెంట్ మహేష్

చిత్తూరు అర్బన్: పోలీసులతో సమానంగా హోంగార్డులు సైతం ప్రజలకు సేవలందిస్తున్నారని కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ ఎం.మహేష్ తెలిపారు. అలాంటి హోంగార్డులను ఏ రోజూ చిన్నచూపు చూడొద్దన్నారు. సోమవారం చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో హోంగార్డుల పరేడ్‌ను పర్యవేక్షించారు. డ్రైవింగ్ విభాగంలో ఉన్న ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో నడుచుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలను సైతం హోంగార్డులకు అమలు చేస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నవాళ్లు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పాలసీలు తీసుకోవడం ద్వారా.. ఏదైనా ప్రమాదం జరిగినపుడు బీమా సొమ్ము అందించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో 362 మంది హోంగార్డులు వారి విధులతో పాటు, పలు శాఖల్లో డెప్యూటేషన్ విధానంలో సైతం పనిచేస్తున్నారని, ఎక్కడ ఉన్నా పోలీసు శాఖకు అనుసంధానమై ఉంటారన్నారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, తిరుపతి హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సాక్షి కార్యాలయంపై దాడికి తెగబడుతున్న టీడీపీ నేతలు, గూండాలు



సాక్షి కార్యాలయంపై రాళ్లు రువ్వుతున్న టీడీపీ నేత



లోపలికి చొరబడే యత్నం



మహిళలను ఉసిగొల్పుతున్న డిప్యూటీ మేయర్

అపోహలు సృష్టించి..

అరాచకం

కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. ప్రజల తరఫున ప్రశ్నించే పత్రికపై కక్షగట్టింది. ఎవరో చేసిన వ్యాఖ్యలను సాక్షి మీడియాకు అంటగట్టేందుకు పన్నాగం పన్నింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అపోహలు సృష్టించేందుకు తెగబడింది. ఇదే అదనుగా ప్రజా గొంతుకను అణగదొక్కాలని పథకం వేసింది. అందులో భాగంగా పచ్చమూకను రెచ్చగొట్టింది. గూండాలను రంగంలోకి దించింది. సాక్షి కార్యాలయంపై దాడికి ఉసిగొల్పింది. సోమవారం సాయంత్రం ఈ మేరకు తిరుపతిలోని టీడీపీ నేతల ఆధ్వర్యంలో రేణిగుంటలోని సాక్షి యూనిట్ ఆఫీస్‌కు రౌడీమూక తరలివచ్చింది. గేటును తన్నుతూ లోపలికి చొరబడేందుకు యత్నించింది. రాళ్లు రువ్వుతూ భయానక వాతావరణం సృష్టించింది. అడ్డుకోబోయిన పోలీసులపై సైతం దౌర్జన్యానికి పాల్పడింది.

ప్రజా గొంతుకపై రెచ్చిపోయిన పచ్చ మూక

- సాక్షి కార్యాలయంపై రాళ్లు రువ్విన గూండాలు
- గేటుని తన్నుతూ.. లోపలికి చొరబడేందుకు యత్నం
- టీడీపీ నేతల ఆధ్వర్యంలో దాడి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : రేణిగుంటలోని తిరుపతి సాక్షి యూనిట్ కార్యాలయంపై సోమవారం సాయంత్రం టీడీపీ మూక దాడికి తెగబడడంపై పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో మాట్లాడిన మాటలను సాక్షి మీడియాకు చుట్టడడంపై మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులుగా ఉండి ఇంతటి అరాచకానికి పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దాడులతో సభ్య సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తున్న సాక్షి పత్రికను నిలువరించేందుకే కుట్రలు చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల గొంతుకగా సేవలందిస్తున్న పత్రిక కార్యాలయంపై దాడి చేయడమంటే, జనంపై దాడి చేయడమే అని స్పష్టం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో రౌడీయిజం చేయడమేంటని నిలదీస్తున్నారు.

భగ్గుమన్న పాత్రికేయలోకం



చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సాక్షి పాత్రికేయ బృందం

రేణిగుంటలోని సాక్షి యూనిట్ కార్యాలయంపై పచ్చమూక వికృత చేష్టలను పాత్రికేయలోకం ఖండించింది. ప్రజా వాణిని వినిపించే పత్రికను అణచివేసేందుకే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారని భగ్గుమంది. దాడి చేసిన వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల్లో సాక్షి విలేకర్లు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. రౌడీమూకపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా యాదమరి పోలీస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరిస్తూ దురుసుగా ప్రవర్తించారు.



సాక్షి యూనిట్‌పై టీడీపీ మూక దాడిచేశారన్న సమాచారం తెలుసుకుని సాక్షి కార్యాలయం వద్దకు చేరుకున్న ఎంపీ గురుమూర్తి

సెక్షన్ 30 బేఖాతర్

రేణిగుంటలో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. ఈ చట్టం ప్రకారం ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. అయితే టీడీపీ నేతలు మాత్రం అధికారమే అండగా చట్టాన్ని అతిక్రమించారు. వందల మంది గూండాలతో కలిసి సాక్షి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇష్టారాజ్యంగా దాడికి యత్నించారు. రోడ్డుపై బైఠాయించారు. చివరకు పోలీసులపై సైతం రౌడీయిజం చేశారు. అయినప్పటికీ పోలీసులు మాత్రం తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. టీడీపీ నేతలను దాదాపు బతిమాలుకుంటూ సాక్షి కార్యాలయం వద్ద నుంచి పంపించారు.

'సాక్షి'పై దాడి సరికాదు



రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై జరుగుతున్న దాడులు సరికాదు. ఆ టీవీలో ప్రసారమైన అంశంపై చానల్ యజమాన్యం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ ఇలా కక్షగట్టి దాడి చేయడం పద్ధతి కాదు. ఉద్యోగులను భయాందోళన కలిగించాలనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారు.

– నాగరాజు, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి

భౌతిక దాడులు అన్యాయం



'సాక్షి'పై కక్షకట్టి భౌతికంగా దాడులు చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించాలి కానీ కార్యాలయాలపై దాడి ఎంతవరకు సమంజసం. నిరసన పేరుతో భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో సంస్థ ఆస్తికి నష్టం కలుగుతుంది. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు ఏం అవుతుందో అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. – గంగరాజు, సీపీఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి

మీడియా స్వేచ్ఛను అణిచివేసే కుట్ర



నిరంతరం ప్రజాపక్షాన నిలిచి సమాజంలో అరాచకాలను, అక్రమాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్న సాక్షి మీడియాపై టీడీపీ నేతలు విచక్షణా రహితంగా దాడి చేయడం ప్రజా స్వరాన్ని, మీడియా స్వాతంత్ర్యాన్ని ఆణిచివేసే కుట్ర. పత్రికా స్వేచ్ఛపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించక కఠిన చర్యలు తీసుకోవాలి. – ఎస్. జయచంద్ర,

సీఐటీయూ తిరుపతి జిల్లా కార్యదర్శి

దాడి దుర్మార్గం



సాక్షి కార్యాలయాలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడడం దుర్మార్గమైన చర్య. టీడీపీ ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడడం విడ్డూరం. పొరబాటు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పత్రికా కార్యాలయంపై దాడులకు పూనుకోవడం రాజ్యాంగ విరుద్ధం. పోలీసులు కేసు నమోదు చేయాలి. – వందవాసి నాగరాజు,

సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి

ప్రయివేటుకు 'షైనింగ్ స్టార్స్'!

- జిల్లా స్థాయిలో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం
- 223 మందిలో 117 మంది ప్రైవేట్ విద్యార్థులు
- అవార్డులు అందజేసిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులకే సింహభాగం అవార్డులు కట్టబెట్టి తమ మనసులోని మాటను మరోసారి రుజువు చేసింది. జిల్లా వ్యాప్తంగా షైనింగ్ అవార్డులకు 223 మంది పది, ఇంటర్మీడియెట్ విద్యార్థులను ఎంపిక చేయగా అందులో ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు 117 మంది ఉండడం దీనికి మరింత బలాన్ని చేకూర్చుతోంది.

అమలు కాని ప్రొటోకాల్

జిల్లా కేంద్రంలో సోమవారం అధికారికంగా షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న అతిథులతో ప్రొటోకాల్ ప్రకారం మాట్లాడించాల్సి ఉంటుంది. అయితే విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులు అలా చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించారు. నగర ప్రథమ పౌరురాలు అయిన నగర మేయర్‌ను ముందస్తుగా మాట్లాడించాల్సింది పోయి చుడా చైర్మన్‌ను మాట్లాడించారు. అదే విధంగా అధికారిక కార్యక్రమాన్ని కూటమి టీడీపీ నేతలు తమ సొంత పార్టీ కార్యక్రమంగా మలుచుకున్నారు. చోటామోటా నాయకులందరూ స్టేజీ పైన కూర్చుని హంగామా సృష్టించడంతో తల్లిదండ్రులు అవాక్కయ్యారు.



షైనింగ్ స్టార్స్ అవార్డును అందజేస్తున్న మంత్రి, ప్రజాప్రతినిధులు

ఉన్నతాశయంతో ముందుకెళ్లాలి

విద్యార్థులు చిన్నతనం నుంచే ఉన్నతాశయంతో ముందుకెళ్లాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు రూ.20 వేల నగదు, మెడల్, మెమెంటో అందించినట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. మొబైల్ ఫోన్ల వాడకం, సోషల్ మీడియా మాయలో పడి విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని చెప్పారు. అనంతరం విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ పాల్గొన్నారు.

అర్ధగిరి క్షేత్రం హుండీ ఆదాయం రూ.9.48 లక్షలు



హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతురావు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.9,48,149 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి టీ.హనుమంతురావు తెలిపారు. సోమవారం అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో హుండీ లెక్కింపు చేపట్టారు. మార్చి 27 నుంచి మే 9వ తేదీ వరకు 75 రోజులకు హుండీ లెక్కించగా పై మొత్తం వచ్చిందని ఈఓ తెలిపారు. హుండీ లెక్కింపులో చిత్తూరు దుర్గాంబ దేవస్థానం ఈఓ మునిశేఖర్, అరగొండ సప్తగిరి గ్రామీణ బ్యాంకు అధికారి బీ.శాంతన్ తదితరులు పాల్గొన్నారు.

15,500 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో 15,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు 46 వేల మంది రైతులకు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

యోగాతో మానసిక దృఢత్వం

- 21న విశాఖపట్నంలో రికార్డు నెలకొల్పుదాం
- బోయకొండలో యోగాదినోత్సవంలో మంత్రి మండిపల్లి
- అధికారులు, ప్రజలతో కలిసి యోగాసనాలు

చౌడేపల్లె: యోగా చేయడం వల్ల శారీరక, మానసిక దృఢత్వంతో పాటు ఒత్తిడిని జయించడం సాధ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. సోమవారం బోయకొండ గోశాల వద్ద 21వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి యోగాసనాల అనంతరం మంత్రి ప్రసంగించారు. ఈనెల 21న విశాఖపట్నంలో చేపట్టే యోగాసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యోగాను ప్రతి రోజూ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. షుగర్, బీపీ లాంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవచ్చని చెప్పారు. జిల్లాలో ఐదు వేల మంది మాస్టర్ ట్రైనర్‌లను ఏర్పాటుచేసి యోగాపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో ఏడు కార్యక్రమాలు చేపట్టేలా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి రోజూ కనీసం అర్ధగంట వ్యాయామం తప్పనిసరిగా చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగా గురువు బాబు ఆధ్వర్యంలో యోగాసనాలు చేపట్టారు. ఆర్‌డీఓ భవాని, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీపీఓ సుధాకర్‌రావు, బోయకొండ ఈఓ ఏకాంబరం, తహసీల్దార్ హనుమంతునాయక్, ఎంపీడీఓ లీలామాధవి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



బోయకొండ వద్ద యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు

బదిలీల్లో కూటమి ఎత్తుగడ

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బదిలీల్లో కూటమి ప్రభుత్వం తన ఎత్తుగడను మానుకోవాలని వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి హితవు పలికారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్జీటీల ప్రత్యక్ష కౌన్సెలింగ్‌కు ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటాలను విచ్ఛిన్నం చేస్తోందన్నారు. వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవాలని ఎస్జీటీలను విద్యాశాఖ అధికారులు బెదిరించడం అన్యాయమన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న తప్పుల కారణంగా జిల్లాలో 70 మందికి పైగా స్కూల్ అసిస్టెంట్లు నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ టీచర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి

క్లుప్తంగా

రోడ్డు విస్తరణకు కలెక్టర్ బంగ్లా స్థలం అప్పగింత

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులకు తన ఇంటి (బంగ్లా) స్థలం ఎంత కావాలో తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులకు సూచించారు. కొంగారెడ్డిపల్లెలో జరగనున్న రోడ్డు విస్తరణ పనులకు ఓవర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న ప్రభుత్వ కలెక్టర్ బంగ్లా ప్రహరీని తొలగించాల్సి ఉంటుంది. దీనిపై కార్పొరేషన్ అధికారులు, కలెక్టర్‌ను సంప్రదించగా.. ఆయన సుముఖం వ్యక్తం చేశారు. విస్తరణకు ఎంత స్థలం కావాలంటే, అంత తీసుకోవచ్చన్నారు. దీంతో సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్‌నాయుడు, కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర రోడ్డు విస్తరణపై కొంగారెడ్డిపల్లె ప్రాంతాన్ని పరిశీలించారు.

మద్యం మత్తులో బావిలో పడి వ్యక్తి మృతి


మృతుడు మోహన్

పుత్తూరు: మద్యం మత్తులో బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం పుత్తూరులో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ రామూర్తి కథనం.. స్థానిక గేట్‌పుత్తూరులోని రజక్ కాలనీకి చెందిన పి.మోహన్(42) పట్టణంలోని సాయినగర్ ప్లాట్స్ వద్ద ఉన్న తిరుమలయ్య బావి వద్ద మద్యం సేవించి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సాయంత్రం బావి యజమాని మోటార్ వేయడానికి రాగా మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లాలోని ఏఎన్‌యూ మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీనియర్ బాలబాలికల అథ్లెట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీలను బుధవారం ఉదయం 7గంటలకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలకు 27-07-2007లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 86868 67079ను సంప్రదించాలని ఆయన కోరారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 90,802 మంది స్వామివారిని దర్శించుకోగా 35,776 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

విత్తుకున్న కష్టాలు!

వేరుశనగ విత్తనాల కోసం రైతులు ముప్పుతిప్పలు ఎదుర్కొంటున్నారు. కాయల కోసం కుస్తీ పడుతున్నారు. రైతు సేవ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు. చివరకు పోలీసులను రంగంలోకి దింపి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా రైతుల నోరు నొక్కేస్తున్నారు.

- వేరుశనగ విత్తనాల కోసం ముప్పతిప్పలు
- అరకొర విత్తనాలతో సర్దిపెడుతున్న అధికారులు
- విత్తనకాయల కోసం రైతుల కుస్తీ
- పట్టించుకోని అధికారులు, పాలకులు


వేరుశనగ విత్తనాల కోసం క్యూ కట్టిన రైతులు

కాణిపాకం: ఖరీఫ్ సీజన్ కింద జిల్లా వ్యాప్తంగా సుమారు 80 వేల హెక్టార్ల దాకా వేరుశనగ సాగయ్యేది. వర్షాభావ పరిస్థితుల కారణంగా వేరుశనగ విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. 2024–25లో 34వేల హెక్టార్ల వరకే పంట సాగైంది. వేసిన పంట కూడా చేతికందక మట్టిపాలైంది. గుడిపాల, యాదమరి, పెనుమూరు తదితర మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా ఇంతవరకు నష్టపరిహారం చేతికందనంటోంది. అయితే ఈసారి వర్షాలు సంమృద్ధిగా కురుస్తున్నాయి. వేరుశనగ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం గతేడాది సాగు విస్తీర్ణాన్ని సాకుగా చూపి విత్తనాల సరఫరా విషయంలో కోత పెట్టింది. దీంతో రైతులు అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

కాయల్లేవ్

గతంలో జిల్లాకు 40వేల క్వింటాళ్ల వరకు వేరుశనగ విత్తనాలు సరఫరా అయ్యేవి. ఒక్కో రైతుకు రెండు నుంచి మూడు బ్యాగులు దాకా ఇచ్చేవారు. ఈసారి 25,560 క్వింటాళ్ల కాయలు మాత్రమే వచ్చాయి. రైతుకు ఒక బ్యాగు కూడా అందని పరిస్థితి నెలకొంది. టోకన్ల కోసం గంటల తరబడి క్యూలో నిరీక్షించినా ఫలితం లేకుండా పోతోంది. టోకన్లు అందని వాళ్లు పంపిణీ కేంద్రాల వద్ద పడిగావులు కాస్తున్నారు. సిబ్బందితో గొడవలకు దిగుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు జోక్యం చేసుకుని రైతులకు సర్దిచెబుతున్నారు.

మళ్లీ వస్తాయని కుంటి సాకులు

కాయలు అరకొరగా రావడంతో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది తలలుపట్టుకుంటున్నారు. అడిగిన వారికి సమాధానం చెప్పుకోలేక తికమక పడుతున్నారు. రైతులు అడిగే ప్రశ్నలకు నోరు మెదపలేకపోతున్నారు. కొందరు కూటమి నేతలు సైతం కాయల కోసం సిబ్బందిని వేధిస్తున్నారు. ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నారు. ఈ తరుణంలో వారి కోపతాపలను అణగ దొక్కి బాధ్యతలను గుర్తుచేసుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో జరిగే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తికమకపడుతున్నారు. ఈ క్రమంలో వారు రైతులకు మాయమాటలు చెప్పాల్సి వస్తోంది. మళ్లీ కాయలు వస్తాయని, వస్తే పిలుస్తామని.. ఆధార్, పట్టాపాసు పుస్తకం జిరాక్స్ పత్రాలు తీసుకుని పంపించేస్తున్నారు. అయితే మళ్లీ కాయలు వచ్చే పరిస్థితి లేదని అధికారులు తెల్చి చెబుతున్నారు. ఉన్నంతలోనే సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. లేకుంటే అన్నదాత సుభీభవలో కోతలు పడతాయంటూ భయపెడుతున్నారు.

విత్తనాలు కూడా ఇవ్వకపోతే ఎలా?



రెండు సీజన్లకు సంబంధించి ప్రభుత్వం పంపిణీ చేసేది..ఒక్క వేరుశనగ విత్తనం మాత్రమే. ఆ విత్తనాలు కూడా ఇవ్వపోతే ఎలా..?. ఇప్పుడున్న రోజుల్లో రైతులను బతికిస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది. ప్రభుత్వం స్పందించి వేరుశనగ పంటకు కావాల్సిన మేర విత్తనాలు పంపిణీ చేయాలి.

– సభాపతి, రైతు, చిత్తూరు మండలం

విత్తు.. చిత్తు

- వేరుశనగ విత్తనాల కోసం నిరీక్షణ
- ఎర్రటి ఎండలో రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చూపులు
- టి.పుత్తూరు ఆర్‌ఎస్‌కేలో ఎస్‌ఐ పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్


టి.పుత్తూరు రైతు సేవా కేంద్రం వద్ద విత్తనాల రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షిస్తున్న రైతన్నలు

తవణంపల్లె: కూటమి ప్రభుత్వంలో వేరుశనగ విత్తనాల కోసం రైతులు నానాఅగచాట్లు పడుతున్నారు. విత్తన కాయలు దొరుకుతాయో లేదోనని రైతు సేవా కేంద్రాల వద్ద అర్ధరాత్రి నుంచే క్యూ కడుతున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం ఎర్రటి ఎండను సైతం లెక్కచేయక నిరీక్షిస్తున్నారు. మండలానికి గత ఏడాది 1,710 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను సరఫరా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం 1,110 క్వింటాళ్లు మాత్రమే అందజేశారు. సోమవారం మండలంలోని టి.పుత్తూరు, పుణ్యసముద్రం, పైమాఘం, సరకల్లు రైతు సేవా కేంద్రాల్లో విత్తనాల పంపిణీ కోసం వ్యవసాయశాఖ అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు.

నీరసిస్తూ..నిరీక్షిస్తూ..

రైతు సేవా కేంద్రాల్లో సోమవారం వేకువ జాము నుంచే రైతులు తమ ఆధార్, పట్టాదారు పుస్తకాలు చేతబట్టి క్యూకట్టారు. రైతులందరూ ఒకే సారి ఎగబడడంతో సిబ్బంది రిజిస్ట్రేషన్ చేయడానికి పోలీసులను ఆశ్రయించారు. అనంతరం పోలీస్ బందోబస్తు మధ్య రిజిస్ట్రేషన్ చేయించారు. టి.పుత్తూరు రైతు సేవా కేంద్రంలో అయితే ఉదయం 5 గంటల నుంచే రిజిస్ట్రేషన్ కోసం రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి జోక్యం చేసుకొని రైతులను క్యూలో పంపి రిజిస్ట్రేషన్ చేయించారు. ఎండలో ఎండుతూ.. చమటలు కక్కుకుంటూ రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షించాల్సి వచ్చింది.


రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీధర్

అందుతాయో లేదో..

మండలానికి గత ఏడాది కంటే కూటమి ప్రభుత్వం 600 క్వింటాళ్ల మేర తక్కువ విత్తనాలు అందజేసింది. సోమవారం 806 మంది రైతులకు 242 క్వింటాళ్లకు రిజిస్ట్రేషన్ చేయించినట్లు తవణంపల్లె ఇన్‌చార్జి వ్యవసాయాధికారిణి వందన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకొన్న రైతులకు మరుసటి రోజు నుంచే విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బందికి సహకరించాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ లక్ష్యం రూ.218.17 కోట్లు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ ఈ ఏడాది ఆదాయ రూ.218.17 కోట్లు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన ఆ వివరాలను మీడియాకు తెలియజేశారు. జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరంగా లక్ష్యాలను ఇచ్చారన్నారు. చిత్తూరు ఆర్వో రూ.77.79 కోట్లు, పలమనేరుకు రూ.34.91 కోట్లు, పుంగనూరుకు రూ.30.79 కోట్లు, కుప్పంకు రూ.22.35 కోట్లు, చిత్తూరు రూరల్ రూ.15.57 కోట్లు, బంగారుపాళ్యంకు రూ.11.44 కోట్లు, కార్వేటినగరానికి రూ.10.88 కోట్లను లక్ష్యంగా కేటాయించినట్లు వివరించారు. ఇప్పటివరకు నెలవారి లక్ష్యంలో ఏప్రిల్‌లో రూ.17.45 కోట్లకు గాను రూ.12.24 కోట్లు, మేలో రూ.15.27 కోట్లకు, రూ.12.12 కోట్లు, జూన్‌కు రూ.17.45కోట్లకు గాను ఆదివారం వరకు రూ.3.54 కోట్లు రాబడి వచ్చిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన జిల్లా లక్ష్యం రూ.181.78 కోట్లకు గాను 77.49 శాతం ఆర్జించినట్లు తెలిపారు. గత ఏడాది కంటే రూ.36.39 కోట్లు అధికంగా వార్షిక లక్ష్యం నిర్దేశించిందన్నారు.

వరసిద్ధుని సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని సోమవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ హరీష్‌కుమార్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు అందించి స్వామి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.

బదిలీలు ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలి

- ఎన్జీవో హోం వద్ద ఐక్యవేదిక ఉపాధ్యాయుల నిరాహార దీక్ష


ఎన్జీవో హోం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న ఐక్యవేదిక ఉపాధ్యాయ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం టీచర్ల బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐక్యవేదిక ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్జీవో హోం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎస్జీటీల బదిలీలను ఆన్‌లైన్‌లో కాకుండా ప్రత్యక్ష విధానంలో నిర్వహించాలన్నారు. గతంలో మాట ఇచ్చి ప్రస్తుతం తప్పడం సబబు కాదన్నారు. టీచర్లు రోడ్డుపైకి వచ్చి పెద్ద ఎత్తున ధర్నాలు చేపడితే కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. స్పందన లేకపోవడంతో నిరాహార దీక్ష నిర్వహించామన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు కొన్ని కేడర్లకు నిర్వహించిన ఆన్‌లైన్ బదిలీల్లో అనేక సమస్యలు వచ్చాయన్నారు. పాయింట్లు ఉన్న వారికి సైతం దూరప్రాంతాలను కేటాయించారని చెప్పారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు స్వామి కణ్ణన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ప్రభుత్వం ప్రత్యక్ష పద్ధతిలో బదిలీ చేరడానికి అంగీకరిస్తూనే, మరోపక్క చాపకింద నీరు లాగా ఆన్‌లైన్ బదిలీలు చేపట్టేందుకు సిద్ధమవడం దారుణమన్నారు. కౌన్సెలింగ్ సమస్యలు పరిష్కరించని పక్షంలో మంగళవారం విజయవాడ మంగళగిరిలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షలో ఉపాధ్యాయ సంఘ నేతలు ఎస్.ఎస్.నాయుడు, సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, ముక్తార్ అహ్మద్, విజయభాస్కర్‌రెడ్డి, గోవిందస్వామి, మంజునాథగుప్తా, నాగరాజ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


బాలాజీ (ఫైల్)

నగరి : రోడ్డు ప్రమాదంలో బాలాజీ (39) అనే రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బుగ్గఅగ్రహారం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తిరుపతి జిల్లా, నారాయణవనం మండలం, దక్షిణపాలమంగళానికి చెందిన బాలాజీ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సోమవారం రాష్ట్ర సరిహద్దు తమిళనాడుకు చెందిన పుణ్యంకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పాలమంగళంకు నాగలాపురం రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బుగ్గ అగ్రహారం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన బాలాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ విజయ్‌నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మృతి చెందిన రైతు పాలమంగళం దక్షిణపు కండ్రిగ సర్పంచ్ కుమారుడు అని గుర్తించారు .

ఇప్పుడే వెళ్లి వస్తానని..

- ఒక్కగానొక్క కొడుకు మృతితో కన్నీరుమున్నీరు

నారాయణవనం: 'అమ్మా... ఇప్పుడే వెళ్లి వస్తా'నని చెప్పి అనంతలోకాలకు వెళ్లిన కుమారుడిని చూసి విలవిల్లాడిన ఆ తల్లిని చూసి స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. ఈ ఘటన మండలంలోని పాలమంగళం దక్షిణపుకండ్రిగలో చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కుప్పస్వామిరెడ్డి, సర్పంచ్ ప్రేమలత ఒక్కానొక్క కుమారుడు బాలాజీరెడ్డి(30)కి ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఏడది వయస్సున్న తన కుమారుడు జక్షిత్‌కి సోమవారం ఉదయమే తన తండ్రి కుప్పస్వామిరెడ్డితో కలిసి నాగలాపురం వెళ్లి తాయత్తు వేసుకొచ్చాడు. ఇంటికొచ్చిన బాలాజీరెడ్డి అనారోగ్యంతో ఉన్న తన తల్లి ప్రేమలతకు టిఫిన్ తెచ్చి పెట్టాడు. పుత్తూరులో పని ఉందమ్మా.. పని ముగించుకుని ఇప్పుడే వస్తానంటూ బాలాజీరెడ్డి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. నగరి సమీపం బుగ్గఅగ్రహారం వద్ద మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలాజీరెడ్డి మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికంగా కలచివేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేస్తూ పంచాయతీలో పార్టీ పటిష్టతకు బాలాజీరెడ్డి ఎంతగానో కృషి చేశాడని పలువురు పేర్కొన్నారు. బాలాజీ మృతి పట్ల పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి. సర్పంచ్‌లు సాయిరవి, నాగూరు, అమ్ములు, సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, భూపాల్‌రెడ్డి, గుణశేఖర్, వైఎస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీలు పొన్నుస్వామి, రవి, దేశమ్మ, చెంచమ్మ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించండి

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- అర్జీలు స్వీకరించిన జేసీ విద్యాధరి


వినతులు పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : సమస్యలు పరిష్కరించండయ్యా..అంటూ జిల్లాలోని ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 235 అర్జీలు వచ్చినట్టు కలెక్టరేట్ ఏవో కులశేఖర్ వెల్లడించారు.

విచారించకుండానే..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసిన తమ వినతిపత్రాన్ని క్షేత్ర స్థాయిలో విచారించకుండా సమస్య పరిష్కరించేశామని క్లోజ్ చేసేశారని విజయపురం మండలానికి చెందిన వేలు, పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు జేసీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మార్చి 19న చిత్తూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. విజయపురం మండలం కోసలనగరం సొసైటీ బ్యాంక్‌లో పనిచేస్తున్న ఇన్‌చార్జి సీఈవో రాధా, మాజీ సీఈవో మురుగయ్య రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇందుకు తగిన ఆధారాలు సైతం వినతిపత్రం తో పాటు అందజేశామన్నారు. వినతిపత్రం ఇచ్చిన అనంతరం ఎస్‌ఐ అని చెబుతూ ఓ వ్యక్తి తమకు కాల్ చేసి బెదిరింపులు చేస్తున్నారన్నారు. దీనిపై విచారించకుండా సమస్య పరిష్కరించామని చెప్పడం బాధాకరమన్నారు.

రోడ్డు మార్గం కల్పించాలి

గుడిపాల మండలం ఒంటిల్లు గ్రామానికి ఎటువంటి రోడ్డు మార్గం లేదని, అధికారులు స్పందించి తమ గ్రామానికి రోడ్డుమార్గం చూపించాలని గ్రామస్తులు రామదాసు, గోపి కోరారు. ఈ మేరకు వారు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. తమ గ్రామం వద్ద బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే మార్గం వెళ్తోందన్నారు. విలేజ్ టర్న్ యాక్టివిటీ రోడ్డు ఆ హైవే వల్ల కోల్పోయిందన్నారు.


న్యాయం చేయాలని కోరుతున్న ఒంటిల్లు గ్రామస్తులు

విచ్చలవిడిగా బోగస్ డీలర్లు

- చిత్తూరు నగరం, మండలంలో 20 రేషన్ షాపుల దాకా బోగస్

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల బియ్యాన్ని దోచుకునేందుకు కుట్రపన్నారు. అడ్డగోలుగా రేషన్ షాపులను లాక్కున్నారు. ఈ క్రమంలో కొన్ని రేషన్‌షాపులు బోగస్ మయమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. చిత్తూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మొత్తం 120 రేషన్‌షాపులున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్ని షాపులను నేతలు బలవంతంగా లాక్కున్నారు. ఇందులో పలు షాపులు బోగస్‌గా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిత్తూరు పరిధిలో 20 షాపుల దాకా బోగస్‌గా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆన్‌లైన్‌లో డీలర్‌గా ఒకరు పేరు ఉంటే...మరో వ్యక్తి ఆధార్ నంబరు కనిపిస్తోంది. కొన్ని మహిళల పేరుతో డీలర్ షాపు కనిపిస్తే.. మగ వ్యక్తి ఆధార్ చూపిస్తోంది. ఇంకొన్ని మహిళల పేరుతో ఉన్న షాపుకు.. మగ వ్యక్తి ఫొటో ఉంటోంది. ఇలా పలు రకాలుగా షాపులు బోగస్‌తో ఉన్నట్లు తెలిసింది. బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారి పేరిట కూడా షాపులు ఉండడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పేదల బియ్యాన్ని దోచుకోవడానికి ఇలా అక్రమపద్ధతిలో రేషన్ షాపులను దక్కించుకున్నట్లు వారు మండిపడుతున్నారు. ఇన్నాళ్లూ ఈబోగస్ దందాను అధికారులే గుట్టుచప్పుడు కాకుండా నడిపించారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

భాషోపాధ్యాయులకు అన్యాయం


ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నిరసన

చిత్తూరు కలెక్టరేట్ : భాషోపాధ్యాయుల అప్‌గ్రేడ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు వినాయకం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టినట్లు తెలిపారు. గత ఆరేళ్ల నుంచి డీఈవో పూల్‌లో ఉన్న అసంబంధ్దతను తొలగించాలన్నారు. 2017లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయుల ఉన్నతీకరణకు జీవో 90ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ఆ తర్వాత 2019 నవంబర్‌లో సవరించి జీవో నం.77 ప్రవేశపెట్టి అర్హతలేని 1,300 మంది భాషోపాధ్యాయులు కేడర్ లేక నష్టపోతున్నారన్నారు. వారందరినీ డీఈవో పూల్‌లో పెట్టి ఇబ్బందులకుగురిచేస్తున్నారన్నారు. బదిలీల మధ్యలో వర్క్‌అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియ చేసి భాషోపాధ్యాయులను దూరప్రాంతాలకు వెళ్లి పనిచేయాలనడం దారుణమన్నారు. డీఈవో పూల్ లో ఉన్న టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు చందు, శ్రీరాములు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం..రథోత్సవం


అంగరంగ వైభవంగా రథోత్సవం

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్నాల వీధి, భేరివీధి, గాంధీరోడ్డు మీదుగా ఆలయానికి చేరుకుంది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా కొనసాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. రథంపై ఉప్పు, మిరియాలు చల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిపించారు. రాత్రి అశ్వవాహన సేవ చేపట్టారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్‌ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఎస్‌ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే రథోత్సవంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో భక్తులకు అరటి పండ్లు పంపిణీ చేశారు.